

అధికారుల శిక్షణ కోర్సుల ప్రారంభోత్సవంలో జైళ్ల శాఖ డీజీ సౌమ్య మిశ్రా

తెలంగాణ జైళ్లు పరివర్తన, పునరావాస కేంద్రాలు

● జైళ్ల శాఖ డీజీ సౌమ్య మిశ్రా

సైదాబాద్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): తెలంగాణ జైళ్లు ఖైదీల పరివర్తన, పునరావాస కేంద్రాలుగా రూపుదిద్దుకుంటున్నాయని జైళ్ల శాఖ డీజీ డాక్టర్ సౌమ్య మిశ్రా అన్నారు. సోమవారం చంచల్‌గూడ సీకా కార్యాలయం హాల్‌లో జైలు నిర్వహణ సూత్రాలు, రాజ్యాంగ న్యాయస్థానం ఆదేశాలపై మూడు రోజుల పాటు నిర్వహించనున్న శిక్షణ కోర్సులను డీజీ ప్రారంభించారు. బ్యూరక్ష ఆఫ్ పోలీస్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్(బీపీఆర్‌డీ), కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ సహకారంతో నిర్వహించనున్న ఈ కోర్సులో 11 రాష్ట్రాల నుంచి 25 మంది జైలు అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా డీజీ మాట్లాడుతూ జైలుగోడల లోపల తీసుకునే ప్రతి నిర్ణయం ఒక వ్యక్తి భవిష్యతుపై, సమాజ భద్రతపై ప్రత్యక్ష ప్రభావన్ని చూపుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జైళ్ల శాఖ ఐజీ ఎన్.మురళీబాబు, రిటైర్డ్ ఐజీ ఎం.ఆర్.అహ్మద్, డీఐజీ డాక్టర్ డి.శ్రీనివాస్, చంచల్‌గూడ జైలు సూపరింటెండెంట్ శివకుమార్ గౌడ్, సీకా ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి, ఏపీ, ఢిల్లీ, గోవా, జార్ఖండ్, కర్ణాటక, ఎంపీ, ఒడిశా, పంజాబ్, రాజస్థాన్, తెలంగాణ, యూపీ రాష్ట్రాలకు చెందిన జైలు అధికారులు పాల్గొన్నారు.



బాధిత కాలనీలవాసులతో కలిసి జడ్‌సీకి వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ చింతల అరుణాసురేంద్రనాథ్ యాదవ్

వరదనీటి నాలాల్లోకి రసాయన వ్యర్థాలు చేరకుండా చర్యలు తీసుకోండి

మన్సూరాబాద్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): రసాయన వ్యర్థాలు నాగోల్ బండ్లగూడ ప్రాంతాల్లో వర్షపునీటి నాలాల్లోకి చేరడంతో పరిసర కాలనీవాసులు అనారోగ్యానికి గురవుతున్నారని నాగోల్ కార్పొరేటర్ చింతల అరుణాసురేంద్రనాథ్ ఆందోళన వ్యక్తం చేశారు. వ్యర్థ జలాలు వరదనీటి నాలాల్లోకి చేరకుండా చర్యలు తీసుకోవాలని జీహెచ్‌ఎంసీ ఎల్బీనగర్ జడ్‌సీ హేమంత కేశవ పాటిల్‌ను సోమవారం ఆయన కార్యాలయంలో ఆయా కాలనీవాసులతో కలిసి కార్పొరేటర్ వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా చింతల అరుణ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న బాక్స్ డ్రైన్ నాలాల అభివృద్ధి, ఎస్‌టీపీ పనులను వేగంగా చేపట్టడం, రసాయన వ్యర్థాలు వర్షపునీటి నాలాల్లోకి మళ్లించకుండా చర్యలు చేపట్టడం ద్వారా బాధిత ఏడు కాలనీలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల సురేంద్రనాథ్‌యాదవ్, సెవెన్‌హిల్స్‌కాలనీ, హిమపురికాలనీ, ద్వారకానగర్, డీపీనగర్, సౌత్‌ఎండ్‌పార్కు కాలనీల సభ్యులు పాల్గొన్నారు.

తిరుమల పద్మశాలి నిత్యాన్నదాన సత్రం ధర్మకర్తగా సంధ్యారాణి



సంధ్యారాణి

మన్సూరాబాద్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని అఖిల భారత భక్తమార్కండేయ పద్మశాలియ నిత్యాన్నదాన సత్రం ధర్మకర్తల మండలి సభ్యురాలిగా సరూర్‌నగర్‌కు చెందిన రావిరాల సంధ్యారాణి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సత్రంలో నిర్వహించిన మండలి సమావేశంలో ధర్మకర్తలను ఎన్నుకున్నారు. ముఖ్యఅతిథిగా అఖిల భారత పద్మశాలి సంఘం మార్గదర్శకుడు చిలువేరు కాశీనాథ్ సమక్షంలో సత్రం ఆవరణలో సోమవారం ధర్మకర్తలు ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా రావిరాల సంధ్యారాణి మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన వారికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీవీటీ, ఎస్‌పీటీ మార్కెట్ల వ్యవస్థాపకుడు చిలువేరు చంద్రయ్య, భద్రాచలంలోని సత్రం అధ్యక్షుడు గోషిక యాదగిరి, తిరుమల సత్రం మాజీ అధ్యక్షుడు జెల్లా లక్ష్మీనారాయణ, బడుగు దానయ్య, బాబురావు, మునగపాటి వెంకటరత్నం, వద్ది శివసత్యనారాయణలు పాల్గొన్నట్లు ఆమె తెలిపారు.

నా భర్తను సైదాబాద్ ఎస్సై నిర్బంధించారు

● డీసీపీ కార్యాలయంలో బాధితురాలు ఫిర్యాదు



సౌత్ ఈస్ట్ డీసీపీ కార్యాలయం వద్ద జయశ్రీ

సైదాబాద్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఇంజాపూర్‌కు సంబంధించిన సివిల్ వివాదంలో జోక్యం చేసుకున్న సైదాబాద్ ఎస్సై తన భర్తను అక్రమంగా పోలీస్‌స్టేషన్‌లో నిర్బంధించి రాజీ చేసుకోమని బెదిరించారని సోమవారం సైదాబాద్‌లోని డీసీపీ కార్యాలయంలో అదనపు డీసీపీ శ్రీకాంత్‌కు అంగోతు జయశ్రీ ఫిర్యాదు చేశారు. అనంతరం బాధితురాలు మీడియాతో మాట్లాడారు. ఇంజాపూర్‌లో తన భర్త అంగోతు సురేష్‌తో కలిసి నివాసం ఉంటున్నామని తెలిపారు. అదే ప్రాంతానికి చెందిన బంధువుకు సంబంధించిన ఫైనాన్స్ వివాదంలో సురేష్ మధ్యవర్తిగా ఉన్నారని ఆమె తెలిపారు. శనివారం మధ్యాహ్నం భార్యాభర్తలం కలిసి బైక్‌పై వెళ్తుండగా ఇంజాపూర్ కమాన్ వద్ద బైకు, కారులలో వచ్చిన గుర్తు తెలియని వ్యక్తులు తమని అడ్డుకుని సురేష్‌పై దాడి చేసి బలవంతంగా కారులో ఎక్కించుకుని పారిపోయారని తెలిపారు. తాను వెంటనే వనస్థలిపురం పోలీసులకు ఫిర్యాదు చేయగా, వారు విచారించి సైదాబాద్ పోలీసులు తీసుకువెళ్లారని తెలిపారని ఆమె పేర్కొన్నారు. తన భర్త సురేష్‌పై సైదాబాద్ పీఎస్‌లో ఎలాంటి ఫిర్యాదు, కేసు కానీ లేదని ఆమె తెలిపారు. అయినా సైదాబాద్ ఎస్సై సాయికృష్ణ తన భర్తను అక్రమంగా తీసుకువచ్చి సైదాబాద్ పీఎస్‌లో నిర్బంధించి బెదిరించాడని ఆరోపించారు. తామంతా పీఎస్‌కు వెళ్లి అడిగితే శనివారం రాత్రి వదిలేశారని ఆవేదన వ్యక్తం చేసింది. ఈ ఘటనపై పోలీస్ ఉన్నతాధికారులు విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని బాధితురాలు కోరారు.

ఫుడ్ డిస్ట్రిబ్యూటర్ అదృశ్యం



రామారావు

వనస్థలిపురం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఫుడ్ డిస్ట్రిబ్యూటర్ అదృశ్యమయ్యాడు. వనస్థలిపురం పోలీస్‌లు తెలిపిన వివరాల ప్రకారం.. వనస్థలిపురం వైదేహినగర్ రోడ్ నంబర్ 3లో తన కుటుంబ సభ్యులతో కలిసి నివాసముండే మెట్టు రామారావు(49) ఫుడ్ డిస్ట్రిబ్యూటర్. ఆదివారం రాత్రి ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబసభ్యులు ఎక్కడ వెతికినా ఆయన ఆచూకీ లభించలేదు. సోమవారం కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమంగా మట్టి విక్రయం

● ముగ్గురిపై అబ్దుల్లాపూర్‌మెట్ పీఎస్‌లో కేసు నమోదు

అబ్దుల్లాపూర్‌మెట్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): అక్రమంగా మట్టిని విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులపై అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కోహెడ రెవెన్యూ పరిధిలో ఏలాంటి అనుమతులు తీసుకోకుండా నరహరి, సత్తయ్య, ఆనంద్ ముగ్గురు వ్యక్తులు ఎక్స్‌కవేటర్ ద్వారా అక్రమంగా మట్టిని తవ్వి టిప్పర్లలో తరలిస్తున్నారు. ఇటీవల దీనిపై అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్‌కు ఫిర్యాదు అందింది. దీంతో ఆయన విచారణ చేపట్టారు. మైనింగ్ శాఖ నుంచి ఏలాంటి అనుమతులు తీసుకోకుండా కరుణాకర్ అనే వ్యక్తి నుంచి మట్టిని కొనుగోలు చేసి టిప్పర్‌ల ద్వారా ఇతరులకు అధిక ధరకు అమ్ముతున్నట్లు విచారణలో తేలింది. తహసీల్దార్ ఫిర్యాదుతో సోమవారం అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు ముగ్గురు వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి, డ్రగ్స్ నిర్మూలనకు ప్రభుత్వం కృషి

ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్‌ను పూర్తిగా నిర్మూలించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తెలిపారు. హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని సర్వే నంబర్ 59లో నూతనంగా నిర్మించిన పెద్దఅంబర్‌పేట్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌ను సోమవారం ఎక్సైజ్ రంగారెడ్డి జిల్లా డిప్యూటీ కమిషనర్ దశరథ, సరూర్‌నగర్ సూపరింటెండెంట్ ఉజ్వలరెడ్డితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా రంగారెడ్డి మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్ నిర్మూలనపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలిపారు. ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ దశరథ మాట్లాడుతూ అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, పెద్దఅంబర్‌పేట్, తుర్కయంజాల్ మున్సిపాలిటీలోని గ్రామాలు కొత్త పోలీస్‌స్టేషన్ పరిధిలోకి వస్తాయని తెలిపారు. కార్యక్రమంలో వనస్థలిపురం ఏసీపీ కాశీరెడ్డి, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ధన్వంత్‌రెడ్డి, గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి, ఎక్సైజ్ పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.



పెద్దఅంబర్‌పేట్ నూతన ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, డిప్యూటీ కమిషనర్ తదితరులు

చీరల పంపిణీ

అబ్దుల్లాపూర్‌మెట్ మండల కేంద్రంలోని శివ గార్డెన్‌లో సోమవారం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి లబ్ధిదారులకు ఇందిర మహిళ శక్తి చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి, ఎంపీడీవో శ్రీవాణి, లీలాకుమారి, మాజీ జడ్పీటీసీ బింగి దేవదాసుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో నూతన ఎక్సైజ్ స్టేషన్లు

● రంగారెడ్డి జిల్లా ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ దశరథ్



మీర్‌పేట్ ఎక్సైజ్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న రంగారెడ్డి జిల్లా డిప్యూటీ కమిషనర్ దశరథ్

మన్సూరాబాద్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం నూతన ప్రొహిబీషన్, ఎక్సైజ్ శాఖ పోలీస్‌స్టేషన్లను అందుబాటులోకి తెచ్చినట్లు రంగారెడ్డి జిల్లా ప్రొహిబీషన్, ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ దశరథ్ పేర్కొన్నారు. సరూర్‌నగర్ ప్రొహిబీషన్, ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన మీర్‌పేటకు చెందిన నూతన ప్రొహిబీషన్, ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా శాఖ డిప్యూటీ కమిషనర్ దశరథ్ మాట్లాడుతూ ప్రొహిబీషన్, ఎక్సైజ్ శాఖ పునర్వ్యవస్థీకరణలో భాగంగా తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలో 14 నూతన ప్రొహిబీషన్, ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్లను మంజూరు చేసిందని తెలిపారు. ఇందులో భాగంగానే నూతంగా మీర్‌పేట్ ప్రొహిబీషన్, ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌ను ప్రారంభించుకున్నామని తెలిపారు. మీర్‌పేట్ స్టేషన్ ఏర్పాటయ్యేంతవరకు సరూర్‌నగర్ స్టేషన్‌లో తాత్కాలిక కార్యకలాపాలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రంక్ లైన్‌పై ఒత్తిడి తగ్గించేందుకు కొత్త లైన్ వేయాలి

● ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



పద్మావతి కాలనీలో ట్రంక్ లైన్ మరమ్మతు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

హయత్‌నగర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్ పద్మావతి కాలనీ గుండా ఉన్న ట్రంక్ లైన్‌పై ఒత్తిడి తగ్గించేందుకు సామనగర్ నుంచి డైవర్షన్ లైన్ వేయాల్సిన అవసరం ఉందని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన పద్మావతి కాలనీలో జరుగుతున్న ట్రంక్ లైన్ మరమ్మతు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామనగర్ నుంచి కొత్త లైన్ వేసేందుకు సుమారు రూ. 68 కోట్లు ఖర్చు అయ్యే అవకాశం ఉందని అన్నారు. వచ్చే బడ్జెట్‌లో నిధులు కేటాయించే విధంగా తన వంతు ప్రయత్నం చేస్తానని ఆయన స్థానికులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హయత్‌నగర్ మాజీ కార్పొరేటర్ సామ తిరుమల్‌రెడ్డి, నాయకులు శ్రీధర్‌గౌడ్, భాస్కర్ సాగర్, మల్లేష్ ముదిరాజ్, సంక్షేమ సంఘం నాయకులు అమర్‌నాథ్‌గౌడ్, అంజిరెడ్డి, మహేష్‌గౌడ్, జంగయ్య పాల్గొన్నారు.

చావునీ డివిజన్‌లో రూ.2.30కోట్లతో అభివృద్ధి

● మలక్‌పేట ఎమ్మెల్యే బలాల



చావునీలో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బలాల

చాదర్‌ఘాట్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): చావునీ డివిజన్‌లో దాదాపు రూ.2.30కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల తెలిపారు. డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను సోమవారం స్థానిక కార్పొరేటర్ సలాం షాహిద్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. డివిజన్‌లోని బాగ్ ఎ జహరాలోని ముంతాజ్ కాలనీలో రూ.20లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డును, బాగ్ ఏ జహరా జామా మజీద్ లేన్‌లో రూ.40లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును, జమ్ జమ్ మెడికల్ హాల్ లేన్‌లో రూ.7.50లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును, సమి కిరాణ స్టోర్ లేన్‌లో రూ.20లక్షల వ్యయంతో సీసీ రోడ్డు, రూ.13లక్షల వ్యయంతో నిర్మించిన తాగునీటి పైప్‌లైన్‌ను, ఎక్ ఖానా మజీద్ లేన్‌లో రూ.10లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డు, రూ.10.50లక్షల వ్యయంతో నిర్మించిన సీవరేజీ పైప్‌లైన్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. చంచల్‌గూడ ప్రభుత్వ జూనియర్ కళాశాల వెనుక ప్రాంతంలో రూ.10లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డును, కుర్మల్‌గూడ లేన్‌లో రూ.15లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డు, పటేల్ రెసిడెంట్స్ ఆఫీసర్స్ కాలనీ లేన్‌లో రూ.20లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డు, చంచల్‌గూడ మెయిన్ రోడ్డులో రూ.33లక్షల వ్యయంతో నిర్మించి బీటీ రోడ్డు, రూ.28లక్షల వ్యయంతో నిర్మించిన రోడ్డు డివైడర్‌ను ఎమ్మెల్యే బలాల ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఈ మల్లికార్జున్ జలమండలి చంచల్‌గూడ మేనేజర్ నవీన్, శానిటేషన్ సూపర్‌వైజర్ వాసు ప్రసాద్, చంచల్‌గూడ ఏడీఈ శోభన్‌తోపాటు ఎంఐఎం నాయకులు పాల్గొన్నారు.

సమన్వయంతో అభివృద్ధి పనులు పూర్తి చేయండి

● జలమండలి, జీహెచ్ఎంసీ అధికారులకు జడ్‌సీ ఆదేశం

● కొత్తపేటలో పలు అభివృద్ధి పనుల పరిశీలన



వరదనీటి కాల్వ పనులను పరిశీలిస్తున్న జడ్‌సీ హేమంత్‌పాటిల్, కార్పొరేటర్ పవన్‌కుమార్

కొత్తపేట, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): జలమండలి, జీహెచ్ఎంసీ అధికారులు సమన్వయంతో వచ్చే ఫిబ్రవరిలోగా అభివృద్ధి పనులు పూర్తి చేయాలని ఎల్‌బీనగర్ జడ్‌సీ హేమంత్‌పాటిల్ ఆదేశించారు. సోమవారం కార్పొరేటర్ పవన్‌కుమార్‌తో కలిసి ఆయన కొత్తపేట డివిజన్ ఎస్‌ఆర్ కాలనీలో రూ.5 కోట్ల వ్యయంతో జరుగుతున్న వరద నీటికాల్వ పనులను పరిశీలించారు. కాల్వ పనుల్లో పాడయ్యే మ్యాన్‌హోల్స్ పునర్నించాలని జలమండలి అధికారులను ఆదేశించారు. అనంతరం వారు ఎస్‌బీహెచ్ కాలనీలో పాడైన రహదారులను పరిశీలించారు. ఈ సందర్భంగా జడ్‌సీ మాట్లాడుతూ వరదనీటి కాల్వ పనులు పూర్తయిన వెంటనే సీసీరోడ్డు పనులకు నిధులు మంజూరు చేస్తామని అన్నారు. ఎస్బీహెచ్ కాలనీలో బీటీ రోడ్డు పనులకు నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. సీటీఓ కాలనీలో కొనసాగుతున్న కమ్యూనిటీ హాల్ అదనపు గదుల నిర్మాణ పనుల నిధుల్లో రూ.15 లక్షలు విడుదల చేస్తామని పేర్కొన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పనులు వేగవంతం చేయాలని కార్పొరేటర్ పవన్‌కుమార్ కోరారు. కార్యక్రమంలో జలమండలి, జీహెచ్‌ఎంసీ అధికారులు, కాలనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఖమ్మంలో సీపీఐ వందేళ్ల వేడుక : రవీంద్రాచారి

సరూర్‌నగర్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించి వచ్చే డిసెంబరునాటికి వంద వసంతాలు పూర్తవుతున్న సందర్భంగా ఖమ్మంలో వందేళ్ల వేడుక నిర్వహించాలని పార్టీ పెద్దలు నిర్ణయించారని, తేదీ, స్థలం వివరాలు త్వరలో ప్రకటించనున్నారని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందోజు రవీంద్రాచారి తెలిపారు. సోమవారం మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని లెనిన్‌నగర్‌లో గల పార్టీ కార్యాలయంలో సీపీఐ బాలాపూర్ మండల సమితి కార్యకర్తల సమావేశం పార్టీ లెనిన్‌నగర్ శాఖ కార్యదర్శి పిచ్చిరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రవీంద్రాచారి మాట్లాడుతూ ఆవిర్భావం నుంచి నేటి వరకు సీపీఐ సాధించిన విజయాలను వందేళ్ల వేడుకలో వివరించనున్నారని తెలిపారు. వేడుకల సందర్భంగా నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో సీపీఐ బాలాపూర్ మండల కార్యదర్శి ఎం.చంద్రశేఖర్‌రెడ్డి, సహాయ కార్యదర్శి జె.రెడ్యానాయక్, గిరిజన సమాఖ్య నాయకులు చత్రునాయక్, పాండునాయక్, శ్రీనునాయక్, రైతు సంఘం నాయకుడు అంజయ్య పాల్గొన్నారు.

నాలుగు లేబర్ కోడ్‌లతో కార్మికుల హక్కులకు విఘాతం: సీఐటీయూ

సరూర్‌నగర్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం కార్మికులకు సంబంధించిన 29 చట్టాలను కుదించి, నాలుగు లేబర్ కోడ్‌లతో కూడిన చట్టాన్ని అమలులోకి తేవడం సరి కాదని సీఐటీయూ నాయకులు ఆక్షేపించారు. సదరు లేబర్ కోడ్‌ల వల్ల కార్మికుల హక్కులకు విఘాతం ఏర్పడనున్నదని వారు ఆందోళన వ్యక్తం చేశారు. నాలుగు లేబర్ కోడ్‌లను వ్యతిరేకిస్తూ సోమవారం సీఐటీయూ బాలాపూర్ శాఖ ఆధ్వర్యంలో బాలాపూర్ చౌరస్తాలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు దాసరి బాబు, శేఖర్‌యాదవ్ మాట్లాడారు. లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేసి, మునుపటిలాగే 29 చట్టాలను కొనసాగించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు యాదగిరిచారి, కిషన్, నిరంజన్, సత్యం, లక్ష్మారెడ్డి, మల్లికార్జున్, బుర్హాన్, మురళీ, సోమ్లానాయక్, మోహన్, శ్రీనూనాయక్, రాములు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రపతి నిలయంలో ఆకట్టుకున్న కళామహోత్సవ్

అల్వాల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో భారతీయ కళామహోత్సవ్ రెండో ఎడిషన్‌లో భాగంగా పశ్చిమ రాష్ట్రాల విభిన్న సాంస్కృతిక, కళాత్మక వారసత్వ మహోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నారు. మూడో రోజు సోమవారం వివిధ పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఉత్సవాల్లో భాగంగా గుజరాత్, మహారాష్ట్ర, రాజస్థాన్, గోవా, దాద్రా నగర్, హవేలీ, డామన్ డయ్యూలకు చెందిన కళాకారుల నృత్యాలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఆయా రాష్ట్రాలకు చెందిన ప్రసిద్ధిగాంచిన వంటకాలను ఫుడ్ స్టాల్స్‌లో విక్రయించారు. సోమవారం 9000 మంది సందర్శకులు రాష్ట్రపతి నిలయాన్ని సందర్శించి కళామహోత్సవ్ వేడుకలను తిలకించారు.



రాష్ట్రపతి నిలయాన్ని సందర్శించిన వివిధ పాఠశాలల విద్యార్థులు

రైతు సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

● ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. సోమవారం అబ్దుల్లాపూర్‌మెట్ మండల కేంద్రంలోని వైఎస్‌ఆర్ గార్డెన్‌లో బాటసింగారం రైతుసేవా సహకార సంఘం చైర్మన్ కొత్తపల్లి జైపాల్ రెడ్డి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే మల్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్నామని అన్నారు. రుణ బకాయిల విషయంలో రైతులను ఇబ్బందులకు గురి చేయవద్దని.. సకాలంలో చెల్లించేలా అవగాహన కల్పించాలని సూచించారు. చైర్మన్ జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ అపరాధ వడ్డీ తగ్గింపుపై తీర్మానం చేసినట్లు తెలిపారు. అనంతరం సకాలంలో రుణాలు చెల్లించిన రైతులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ దేవదాసుగౌడ్, మేనేజర్ ఐలేష్ యాదవ్, సంఘం డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

వృద్ధురాలికి కేర్ ఆస్పత్రిలో అరుదైన సర్జరీ

హైదరాబాద్ సిటీ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పిత్తాశయం చిట్లిపోయిన, అనేక వ్యాధులున్న వృద్ధురాలికి అధిక రిస్క్‌తో కూడిన లాపరోస్కోపిక్ పిత్తాశయ శస్త్రచికిత్సను కేర్ ఆస్పత్రి వైద్యులు విజయవంతగా నిర్వహించారు. సర్జరీ వివరాలను సోమవారం కేర్ ఆస్పత్రి వైద్యులు వెల్లడించారు. నల్గొండకు చెందిన 72ఏళ్ల వృద్ధురాలు అస్వస్థత కారణంగా స్థానిక ఆస్పత్రిలో పరీక్షలు చేయించుకోగా పిత్తాశయం చిట్లి, తీవ్రమైన కాలిక్యులస్ కోలిసిస్టిటిస్ ఉన్నట్టు గుర్తించారు. ఆమెను ఇటీవల మలక్‌పేటలోని కేర్ ఆస్పత్రికి తీసుకొచ్చారు. సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ రోబోటిక్ సర్జరీ విభాగం సీనియర్ కన్సల్టెంట్ హెడ్ డాక్టర్ భూపతి రాజేంద్ర ప్రసాద్ నేతృత్వంలోని బృందం లాపరోస్కోపిక్ అథెసియోలిసిస్, కోలిసిస్టెక్టమీతో పాటు పూర్తి పెరిటోనియల్ వాష్ ప్రక్రియను నిర్వహించింది. శస్త్రచికిత్స వల్ల తీవ్రమైన సెప్సిస్, అవయవాల పనితీరు దెబ్బతినే ప్రమాదం తప్పిపోయిందని డాక్టర్ రాజేంద్ర ప్రసాద్, మలక్‌పేట కేర్ ఆస్పత్రి చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ ప్రవీణ్ కుమార్ ఎడ్లా వివరించారు. దీర్ఘకాలిక వ్యాధులు ఉన్న వృద్ధ రోగుల్లో ఇటువంటి కేసులను లాపరోస్కోపిక్‌గా చేయడం చాలా అరుదని, రోగి కోలుకోవడంతో డిశ్చార్జి చేసినట్లు వారు తెలిపారు.

చిత్రసీమకాలనీ అసోసియేషన్ కమిటీ ఎన్నిక



నూతన అధ్యక్షుడు జేజే రెడ్డి, సభ్యులు

మన్సూరాబాద్, నవంబరు 24 (ఆంధ్ర జ్యోతి): మన్సూరాబాద్ డివిజన్ చిత్రసీమకాలనీ సంక్షేమ సంఘం నూతన కమిటీ ఎన్నికైంది. అధ్యక్షుడిగా జక్కిడి జయేందర్ రెడ్డి (జేజే రెడ్డి), ప్రధాన కార్యదర్శిగా గౌర మల్లేశం, ఉపాధ్యక్షుడిగా టి.నాగేశ్వరరావు, రమణ, బిక్షపతి, గౌరవాధ్యక్షుడిగా బిక్షమయ్య, సంయుక్త కార్యదర్శిగా డి.రాంగోపాల్‌రెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శిగా వెంకట్‌రెడ్డి, కల్చరల్ కార్యదర్శిగా వై.బాల్‌రెడ్డి, ట్రెజరర్‌గా పీఎంఎస్ కుమార్, ఈసీ మెంబర్లు ఎన్నికయ్యారు.

అభయాంజనేయ స్వామి ఆలయ కమిటీ చైర్మన్‌గా మోహన్‌రెడ్డి

అదేవిధంగా చిత్రసీమకాలనీలోని అభయాంజనేయ స్వామి ఆలయ కమిటీ చైర్మన్‌గా పి.మోహన్‌రెడ్డి, ఆడిట్ కమిటీ చైర్మన్‌గా నర్ర సుదర్శన్‌రెడ్డి, వైస్ చైర్మన్లుగా ఎ.మల్లికార్జున్‌రెడ్డి, పి.లక్ష్మారెడ్డి, సీహెచ్ వెంకట్‌రెడ్డి, కె.శంకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా నందిరాజు సాయి, సంయుక్త కార్యదర్శిగా బి.అశోక్, కార్యనిర్వాహక కార్యదర్శిగా విశ్వమోహన్‌రెడ్డి, ట్రెజరర్‌గా వి.వెంకటేశ్వర్లు, ఈసీ మెంబర్లు, సలహాదారులు ఎన్నికయ్యారు.

రాక్‌టౌన్‌కాలనీ అధ్యక్షుడిగా వినోద్‌రెడ్డి



సభ్యులతో కలిసి ప్రమాణస్వీకారం చేస్తున్న అధ్యక్షుడు వినోద్‌రెడ్డి

మన్సూరాబాద్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): నాగోల్ డివిజన్ పరిధి రాక్‌టౌన్‌కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ సొసైటీ ఎన్నికలు ఆదివారం రాత్రి కొనసాగాయి. ఈ ఎన్నికల్లో అధ్యక్షుడిగా ఎర్ర వినోద్‌రెడ్డి రెండోసారి ఎన్నికయ్యారు. అదే విధంగా ఉపాధ్యక్షుడిగా తుమ్మలపల్లి మణిపాల్‌రెడ్డి, ప్రధానకార్యదర్శిగా నాగవెల్లి జైపాల్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా నంద్యాల సూర్యనారాయణలు రెండోసారి గెలుపొందగా ట్రెజరర్‌గా సూదిని రాంచంద్రారెడ్డి నూతనంగా ఎన్నికయ్యాడు. ఎన్నికల అధికారులు ఎంకే చతుర్వేది, పాల్వాయి రాంరెడ్డి, శ్రీలేఖ, కామేశ్వరరావు, వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో జరిగిన ఈ ఎన్నికల్లో 780 మంది ఓటర్లలో 578మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం నూతన కమిటీతో ప్రమాణస్వీకారం చేయించారు. తన ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికీ వినోద్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

శ్రీమన్నారాయణీయం 50 దశకముల పారాయణం

దిల్‌సుఖ్‌నగర్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): గడ్డిఅన్నవర క్షేత్రంలోని వీర వెంకట సత్యనారాయణ స్వామి దేవస్థానంలో శ్రీమన్నారాయణీయం 50 దశకముల పారాయణం సోమవారం ఘనంగా నిర్వహించారు. అనంతరం విష్ణు సహస్రనాయ పారాయణం, లలిత సహస్ర నామ పారాయణం, సౌదర్య లహరి పారాయణం నిర్వహించారు. ఆధ్యాత్మిక వేత్త కొండూరు పద్మావతి బృందం 300 మంది సభ్యులతో కలిసి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ దేవరం లింగారెడ్డి, కోశాధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఖాళీ 'డబుల్ ఇళ్ల'ను ఎరుకల కులస్థులకు కేటాయించండి : బీవైకేఎస్

మన్సూరాబాద్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఖాళీగా ఉన్న డబుల్ బెడ్రూం ఇళ్లను ఆదివాసీ, ఎరుకల గిరిజనులకు కేటాయించాలని భారత ఎరుకల కుల వృత్తుల అభివృద్ధి సేవా సంఘం(బీవైకేఎస్) వ్యవస్థాపక అధ్యక్షుడు కండెల వెంకటేశ్వర్లు కోరారు. ఈ మేరకు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డిని సోమవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కండెల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కొన్నేళ్లుగా మన్సూరాబాద్ సర్వే నం.4, 5లలో గుడిసెలు వేసుకుని కొందరు, అద్దె ఇళ్లల్లో మరికొందరు ఎరుకల కులస్థులు జీవనం గడుపుతున్నారని అన్నారు. నిరుపేదలైన వీరికి ఖాళీగా ఉన్న డబుల్ బెడ్రూం ఇళ్లను కేటాయించడంతో పాటు ఖాళీగా ఉన్న స్థలాల్లో ఎరుకల కులస్థులకు వెయ్యి గజాలు మినీ ఫంక్షన్ హాలు, ఐదెకరాలు శ్మశానవాటికలకు కేటాయించాలని కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో బీవైకేఎస్ రాష్ట్ర కార్యదర్శి వనం గంగయ్య, కండెల మారయ్య, కె.విజయ్, దాసరి గంగాధర్, జగన్నాథం, వెంకన్న, పూజారి వెంకన్న, జె.కృష్ణ, జె.శేఖర్, తరుణ్, మద్దిలేటి, కుంభం సుంకయ్య, అనురాధ, పద్మ, వనం శాంతి, అనిత తదితరులు ఉన్నారు.


● కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు ప్రారంభం



సైదాబాద్ డివిజన్ చేపల మార్కెట్ వాలీబాల్ గ్రౌండ్‌లో రూ.25లక్షలతో చేపట్టనున్న కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను ప్రారంభించిన కార్పొరేటర్ కొత్తకాపు అరుణారెడ్డి తదితరులు

- సైదాబాద్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి)

● వినతి



బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ వైదేహినగర్ కాలనీ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌కు వినతి పత్రం అందజేస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

- వనస్థలిపురం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి)